


Registered No : APTEL/25/A0818

# ఇది కద నిజం

సామాన్యుని సమస్యలపై నిత్యం పోరాడే ఆయుధంగా.. జాతీయ తెలుగు దిన పత్రిక




గురువారం 10-09-2026 | పేజీలు : 4 | వెల : 2/- | సంపుటి :2 | సంచిక :84 | www.edikadanijam.com | ఎడిటర్ : బాలరాజ్ గౌడ్

## బీఆర్ఎస్‌పై స్పీకర్ కొరడా!



2 లో

- సెషన్ ముగిసే వరకు సస్పెన్షన్
- పోడియం వద్ద బీఆర్ఎస్ ఆందోళన
- నినాదాలతో సభలో తీవ్ర గందరగోళం
- కేటీఆర్, హరీశ్‌రావు సహా 22 మందికి షాక్
- శ్రీధర్‌బాబు తీర్మానానికి సభ ఆమోదం
- అసెంబ్లీ ప్రాంగణంలో మరింత వేడెక్కిన రాజకీయం

## స్థానిక పోరులో తగ్గేదేలే

- ఎన్నికల వాయిదాకు కుట్రంటూ ఆరోపణ
- 34 శాతం రిజర్వేషన్లపై విమర్శలు
- 44 లక్షల ఓట్లపై ప్రశ్నలు
- ఎన్నికలు సజావుగా జరగాలి
- వైసీపీ శ్రేణులకు జగన్ పిలుపు
- ఎన్నికలు జరిగితే వైసీపీదే గెలుపు
- స్థానిక ఎన్నికలే కురుక్షేత్రం



2 లో

**న్యూస్ డెస్క్, 09 సెప్టెంబరు (ఇది కద నిజం):** స్థానిక సంస్థల ఎన్నికలపై వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ కీలక వ్యాఖ్యలు చేశారు. స్థానిక ఎన్నికలు జరుగుతాయో లేదో కూడా స్పష్టత లేదన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు బీసీలకు 34 శాతం రిజర్వేషన్ల పేరుతో డ్రామా చేస్తున్నారని, ఆ అంశాన్ని సాకుగా చూపించి ఎన్నికలను వాయిదా వేయాలని కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. ఇలాంటి పరిస్థితుల్లో వైసీపీ శ్రేణులు గట్టిగా నిలబడి పోరాడాలని పిలుపునిచ్చారు. ఎన్నికలు ఎప్పుడు, ఎలా జరిగినా ప్రజలకు వైసీపీ తోడుగా నిలబడుతుందన్నారు. ఎన్నికలు సాఫీగా జరిగితే వైసీపీదే విజయం అని.. ఎన్నికలు సాఫీగా జరగనివ్వకపోయినా గట్టిగా పోరాడదాం అని, జరిగేది కురుక్షేత్ర సంగ్రామం అని వైఎస్ జగన్ పేర్కొన్నారు.


స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని చెబుతున్నప్పటికీ, అది న్యాయస్థానంలో నిలబడదని సీఎం చంద్రబాబుకు ముందే తెలుసని వైఎస్ జగన్ వ్యాఖ్యానించారు. కోర్టు ఆ రిజర్వేషన్లను కొట్టివేస్తే.. అదే కారణంతో స్థానిక ఎన్నికలను వాయిదా వేయాలని ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు.

## ఈ-20పై తెలంగాణ సర్కార్ క్లారిటీ!

- ఈ-20పై అపోహలే.. నష్టం ప్రూవ్ కాలేదు
- వాహనాలు పాడైనట్లు ఫిర్యాదుల్లేవు
- ఈ-20పై కీలక ప్రకటన చేసిన పొన్నం
- ఏప్రిల్ 1 నుంచి దేశవ్యాప్తంగా ఈ-20
- కొత్త పెట్రోల్ వాహనాలకు ఈ-20 తప్పనిసరి
- మైలేజ్ తగ్గినా ప్రయోజనాలు ఎక్కువే 2 లో
- రైతులకు మేలు చేసే ఇథనాల్ పరిశ్రమలు

## కవితపై పోస్టులు..పోలీస్ యాక్షన్!

- కవితపై అసభ్య పోస్టులు
- కానిస్టేబుల్‌పై పోలీస్ యాక్షన్
- వెంటనే విధుల నుంచి సస్పెన్షన్
- క్రిమినల్ కేసులు నమోదు
- సైబర్ క్రైమ్స్‌లో కేసు
- ఫోన్ స్వాధీనం చేసుకున్న పోలీసులు
- ఎఫ్ఎస్ఎల్‌కు మొబైల్ తరలింపు
- మహిళలపై వేధింపులకు కఠిన చర్యలు



2 లో

**న్యూస్ డెస్క్, 09 సెప్టెంబరు (ఇది కద నిజం):** మహిళల గౌరవానికి భంగం కలిగించేలా ప్రవర్తించే వారిపై, ప్రత్యేకించి చట్టాన్ని కాపాడాల్సిన పోలీసులే నిబంధనలు ఉల్లంఘిస్తే ఉపేక్షించేది లేదని తెలంగాణ పోలీస్ శాఖ స్పష్టం చేసింది. మాజీ ఎంపీ, టీఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితను ఉద్దేశించి సామాజిక మాధ్యమాల్లో అత్యంత అసభ్యకరమైన, అనుచిత పోస్టులు పెట్టిన వ్యవహారంలో ఓ పోలీసు కానిస్టేబుల్‌పై పోలీస్ శాఖ తీవ్రస్థాయిలో చర్యలు చేపట్టింది. ఫిర్యాదు అందిన వెంటనే స్పందించిన ఉన్నతాధికారులు, సివిల్ సర్వీసెస్ కాండక్ట్ రూల్స్ ప్రకారం సదరు కానిస్టేబుల్ కె. అనిల్‌ను తక్షణమే విధుల నుంచి సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

## సర్ పూర్తయ్యాకే ఎన్నికలా?

- బీసీ రిజర్వేషన్లపై హైకోర్టులో పిల్
- బీసీ జనాభా నిష్పత్తిలో రిజర్వేషన్లు కోరుతూ పిటిషన్
- ఓటర్ల జాబితా సవరణపై కోర్టు దృష్టి
- ప్రక్రియలు పూర్తికాకుండా ఎన్నికలు వద్దంటూ వాదన
- బీసీ అభ్యర్థులు, ఓటర్లకు అన్యాయం- పిటిషనర్లు
- వాదనలకు సమయం కోరిన ప్రభుత్వం, ఈసీ
- వచ్చే బుధవారానికి విచారణ వాయిదా 2 లో

## అమెరికాపై కెనడా వార్!

- అగ్రరాజ్యం వస్తువులపై 50% సుంకం
- 700 అమెరికా ఉత్పత్తులపై కౌంటర్ టారిఫ్
- స్టీల్, అల్యూమినియంపై భారీ షాక్ 2 లో
- 27.6 బిలియన్ డాలర్ల దిగుమతులపై ప్రభావం
- చర్చలు విఫలం.. ప్రతీకారానికి కెనడా రెడీ
- సెప్టెంబర్ 15 నుంచి అమెరికా కౌంటర్ యాక్షన్

## తెలుగు రాష్ట్రాలకు కేంద్రం వరాలజల్లు



- రైల్వేలకు కేంద్రం భారీ బూస్ట్
- తెలుగు రాష్ట్రాల్లో ట్రాక్‌ల విస్తరణ
- రూ.20,804 కోట్లకు కేబినెట్ గ్రీన్‌సిగ్నల్
- సికింద్రాబాద్-కాజీపేటకు మల్టీ ట్రాకింగ్
- విశాఖ-విజయవాడకు కొత్త రైల్వే నెట్‌వర్క్
- దక్షిణాదికి 540 కి.మీ. కొత్త ట్రాక్‌లు
- రద్దీ తగ్గింపు.. రైళ్ల వేగం పెంపు
- తిరుపతి, యాదాద్రికి మెరుగైన కనెక్టివిటీ
- సరుకు రవాణాకు 47 MTPA సామర్థ్యం

**న్యూస్ డెస్క్, 09 సెప్టెంబరు (ఇది కద నిజం):** ప్రధాని మోదీ అధ్యక్షతన సమావేశమైన మంత్రివర్గ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. దేశంలోని కీలక రైల్వే మార్గాల్లో రవాణా సామర్థ్యాన్ని పెంచడం, రద్దీని తగ్గించడం, రైళ్ల నిర్వహణ సామర్థ్యాన్ని మెరుగుపరచడం లక్ష్యంగా భారీ ప్రాజెక్టులకు ఆమోదం తెలిపింది. మొత్తం రూ.20,804 కోట్ల విలువైన ఎనిమిది రైల్వే ప్రాజెక్టులకు ఆమోదం లభించింది. 7 రైల్వే కారిడార్లలో నాలుగు లేన్ల నిర్మాణం చేపట్టాలని నిర్ణయం తీసుకున్నారు. కేబినెట్ నిర్ణయాలను కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ మీడియాకు వెల్లడించారు. విశాఖ-విజయవాడ మీదుగా నాలుగు లేన్ల రైల్వే నెట్‌వర్క్ చేపట్టనున్నారు. అలాగే ముంబై-చెన్నై రైల్వే కారిడార్‌లో భాగంగా గుంతకల్లు-రేణిగుంట మీదుగా 4 లేన్ల నిర్మాణం చేయనున్నారు.

గత 12 ఏళ్లుగా కొనసాగుతున్న రైల్వే ఆధునికీకరణలో భాగంగానే ఈ ప్రాజెక్టులను చేపడుతున్నట్లు కేంద్రమంత్రి తెలిపారు.

మిగతాది 2 లో..

## బీజేపీకి విరాళాల వరద!

- రూ.1,472.8 కోట్ల విరాళాలు
- కాంగ్రెస్‌కు రూ.207.17 కోట్ల రాబడి
- బీజేపీకి ఏడు రెట్లు అధికం
- ఎన్నికలలో రూ.904.6 కోట్లు పెరుగుదల
- బీజేపీ ఖర్చుల్లో అసోం టాప్
- ప్రచారానికి భారీగా ఖర్చు
- కాంగ్రెస్ ఖర్చు రూ.248.55 కోట్లు




2 లో

**న్యూస్ డెస్క్, 09 సెప్టెంబరు (ఇది కద నిజం):** దేశంలో ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల సమయంలో భారతీయ జనతా పార్టీ కేంద్ర ప్రధాన కార్యాలయానికి భారీగా నిధులు సమకూరాయి. ఎన్నికల సంఘానికి పార్టీ సమర్పించిన ఖర్చుల నివేదిక ప్రకారం.. ఎన్నికల కాలంలో బీజేపీ కేంద్ర హెడ్‌క్వార్టర్స్‌కు దాదాపు రూ. 1,472.8 కోట్ల విరాళాలు అందాయి. ఇదే సమయంలో కాంగ్రెస్ పార్టీ కేంద్ర, రాష్ట్ర యూనిట్ల ద్వారా నికరంగా రూ.207.17 కోట్ల రాబడి వచ్చింది. ఈ లెక్కన కాంగ్రెస్‌తో పోలిస్తే బీజేపీ ఏడు రెట్లకు పైగా నిధులను కూడగట్టడం గమనార్హం.

## కేసీఆర్‌కు సొంతవాళ్లతోనే ముప్పు

- రేవంత్‌పై బీఆర్ఎస్ తీరుపై ఫైర్
- కేసీఆర్‌కు పూర్తి భద్రత ఉందన్న మహేశ్
- పిండ ప్రదానంపై తీవ్ర విమర్శలు
- బీఆర్ఎస్ నేతలపై మండిపాటు
- కవిత వ్యాఖ్యలను ప్రస్తావించిన మహేశ్
- కేసీఆర్ త్వరగా కోలుకోవాలన్న ఆకాంక్ష
- కాంగ్రెస్‌దే సామాజిక న్యాయమని స్పష్టం



2 లో

**న్యూస్ డెస్క్, 09 సెప్టెంబరు (ఇది కద నిజం):** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పట్ల బీఆర్ఎస్ నాయకులు వ్యవహరిస్తున్న తీరుపై టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బి. మహేష్ కుమార్ గౌడ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడూ కేసీఆర్ చెడును కోరుకోలేదని, ప్రతిపక్ష నాయకుడిగా ఆయనకు తగిన గౌరవం ఇస్తున్నామని స్పష్టం చేశారు. "కేసీఆర్ గతంలో బాత్‌రూమ్‌లో జారిపడినప్పుడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే స్పందించి అర్ధరాత్రి గ్రీన్ ఛానల్ ద్వారా ఆసుపత్రికి తరలించి మెరుగైన వైద్యం అందించారు. కేసీఆర్ అసెంబ్లీకి వస్తే స్వయంగా సీఎం ఆయన ఆరోగ్యం గురించి ఆరా తీశారు. రాష్ట్రంలో సీఎం తర్వాత అత్యధిక సెక్యూరిటీ పొందుతున్న వ్యక్తి కేసీఆరే" అని మహేశ్ గౌడ్ తెలిపారు.

## ఉబర్, రాపిడోకు బిగ్ షాక్!




2 లో

**న్యూస్ డెస్క్, 09 సెప్టెంబరు (ఇది కద నిజం):** ప్రముఖ రైడ్-హెయిలింగ్ సంస్థలైన ఉబర్, రాపిడో లకు దిమ్మతిరిగే షాక్ తగిలింది. చండీగఢ్ రాష్ట్రంలో 'అగ్రిగేటర్ పాలసీ-2025' నిబంధనలను పాటించడంలో విఫలమైన ఆ రెండు కంపెనీల అగ్రిగేటర్ లైసెన్సులను స్టేట్ ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ ఏకంగా 6 నెలల పాటు సస్పెండ్ చేసింది.

## మాపై దాడి.. మాపైనే కేసులా?



2 లో

- గవర్నర్‌కు 13 పేజీల ఫిర్యాదు
- తెలంగాణలో ఎమర్జెన్సీ వాతావరణం: కేటీఆర్
- బ్లాక్ టీషర్ట్‌లతో వెళ్తే అడ్డుకున్నారు
- సబితమ్మ గొంతు పట్టారు.. సునీత చీర లాగారు
- ఎమ్మెల్యేలపై పోలీసుల దాడి: కేటీఆర్ ఆరోపణ
- ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌పై దాడికి కుట్ర
- సీఎస్, డీజీపీతో మాట్లాడతానన్న గవర్నర్

Registered No : APTEL/25/A0818
ఇది కద నిజం
గురువారం 10-09-2026

## బీజేపీకి విరాళాల వరద!

మొదటి పేజీ తరువాయి

నిధులు, ఖర్చుల వివరాలు ఇలా..

అస్సాం, కేరళ, తమిళనాడు, పశ్చిమ బెంగాల్, పుదుచ్చేరి రాష్ట్రాల ఎన్నికల నిమిత్తం మార్చి 15 నుంచి మే 6 మధ్య కాంగ్రెస్ మొత్తం రూ.248.55 కోట్లు ఖర్చు చేయగా.. ఆ పార్టీ నిధులు రూ.169.06 కోట్ల నుంచి రూ.103.2 కోట్లకు పడిపోయి దాదాపు రూ.65.86 కోట్ల లోటును చవిచూశాయి. మరోవైపు కేరళ, పశ్చిమ బెంగాల్‌కు సంబంధించిన బీజేపీ ఖర్చుల నివేదికలు ఇంకా బహిరంగం కాలేదు. దీంతో బీజేపీ మొత్తం రాబడి ఇంకా పెరిగే అవకాశం ఉంది. మార్చి 15 నాటికి రూ.6,722.6 కోట్లుగా ఉన్న బీజేపీ కేంద్ర కార్యాలయ క్లోజింగ్ బ్యాలెన్స్.. మే 6 నాటికి రూ.7,627.2 కోట్లకు చేరింది. ఎన్నికల సమయంలోనే పార్టీ ఖాతాలో అదనంగా రూ.904.6 కోట్లు పెరగడం విశేషం.

రాష్ట్రాల వారీగా బీజేపీ ఖర్చులు..

అస్సాంలో, తమిళనాడు, పుదుచ్చేరి రాష్ట్రాల్లో బీజేపీ ఇప్పటి వరకు సుమారు రూ.159.7 కోట్లు ఖర్చు చేసినట్లుగా నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. ఇందులో సుమారు రూ.130.4 కోట్లు సాధారణ పార్టీ ప్రచారం కోసం వెచ్చించగా, మిగిలిన మొత్తం అభ్యర్థులు, ఇతర ఖర్చులకు వెళ్లింది. అస్సాంలో అత్యధికంగా రూ.96.27 కోట్లు ఖర్చు చేశారు. ఇందులో సాధారణ ప్రచారం కోసం రూ.76.73 కోట్లు, అభ్యర్థుల కోసం రూ.19.54 కోట్లు వెచ్చించారు. ప్రకటనల కోసం సుమారు రూ.37 కోట్లు, స్టార్ క్యాంపైనర్ల ప్రయాణాల కోసం రూ.27.3 కోట్లు ఖర్చయ్యాయి. పుద్దుచ్చేరిలో రూ.11.90 కోట్లు ఖర్చు కాగా.. ఇందులో రూ.9.19 కోట్లు సాధారణ ప్రచారం కోసం, రూ.2.71 కోట్లు అభ్యర్థుల కోసం ఖర్చు చేశారు. తమిళనాడులో రూ.51.56 కోట్లు ఖర్చు చేయగా.. ఇందులో సాధారణ ప్రచారం కోసం రూ.44.51 కోట్లు, అభ్యర్థుల కోసం రూ.7.05 కోట్లు కేటాయించారు. మీడియా ప్రకటనల నిమిత్తం సుమారు రూ.23.96 కోట్లు, స్టార్ క్యాంపైనర్ల ప్రయాణాలకు రూ.10.04 కోట్లు, ప్రచార సామగ్రికి రూ.5.85 కోట్లు ఖర్చు చేశారు.

ఆచితూచి కాంగ్రెస్..

ఇక కాంగ్రెస్ పార్టీ ఐదు రాష్ట్రాల్లో సాధారణ ప్రచారం కోసం రూ.143 కోట్లు, అభ్యర్థుల కోసం రూ.105.55 కోట్లు కలిపి మొత్తం రూ.248.55 కోట్లు ఖర్చు చేసింది. కేరళలో వామపక్ష కూటమిని ఓడించి అధికారంలోకి వచ్చిన ఆ పార్టీ.. అక్కడ ప్రచారం కోసం అత్యధికంగా రూ.59.28 కోట్లు వెచ్చించింది. ఆ తర్వాత స్థానంలో అసోంలో రూ.22.62 కోట్లు ఖర్చు చేసింది. కాంగ్రెస్ కేంద్ర ప్రధాన కార్యాలయం ఐదు రాష్ట్రాల సాధారణ ప్రచారం కోసం రూ.40.52 కోట్లు ఖర్చు చేయగా.. స్టేట్లు మరో రూ.102.49 కోట్లు వెచ్చించాయి.

## బీఆర్ఎస్‌పై స్పీకర్ కొరడా!

**న్యూస్ డెస్క్, 09 సెప్టెంబరు (ఇది కద నిజం):** తెలంగాణ శాసనసభ వర్షాకాల సమావేశాలు ఉద్రిక్తంగా మారాయి. సభా కార్యక్రమాలకు పదే పదే ఆటంకం కలిగిస్తున్నారనే కారణంతో ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ శాసనసభ్యులపై స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ తీవ్ర చర్యలు తీసుకున్నారు. దాదాపు 22 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను ఈ వర్షాకాల సెషన్ ముగిసే వరకు సస్పెండ్ చేస్తున్నట్లు స్పీకర్ బుధవారం ప్రకటించారు. సభ ప్రారంభం కాగానే ప్రతిపక్ష బీఆర్ఎస్ సభ్యులు పోడియం వద్దకు వెళ్లి నినాదాలతో సభను స్తంభింపజేసే ప్రయత్నం చేశారు. స్పీకర్ పదే పదే విజ్ఞప్తి చేసినప్పటికీ గందరగోళం కొనసాగడంతో శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రతిపాదించిన సస్పెన్షన్ తీర్మానానికి సభ ఆమోదం తెలిపింది. కేటీఆర్, హరీష్ రావు, జగదీష్ రెడ్డి సహా 22 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను సెషన్ ముగిసే వరకు సస్పెండ్ చేస్తున్నట్లు స్పీకర్ ప్రకటించారు.

22ఏ అంశంపై బీజేపీ వాకౌట్..

మరోవైపు నిషేధిత భూముల జాబితా (22ఏ) అంశంపై అసెంబ్లీలో తక్షణమే చర్చ చేపట్టాలని బీజేపీ సభ్యులు డిమాండ్ చేశారు. తమ వాయిదా తీర్మానంపై స్పందించకపోవడంతో పాటు 22ఏ పై చర్చించేందుకు ప్రభుత్వం ముందుకు రాకపోవడాన్ని నిరసిస్తూ బీజేపీ శాసనసభ్యులు సభ నుంచి వాకౌట్ చేశారు. ఈ పరిణామాలతో తెలంగాణ అసెంబ్లీ ప్రాంగణంలో రాజకీయ వాతావరణం మరింత వేడెక్కింది.

## స్థానిక పోరులో తగ్గేదేలే: జగన్!

మొదటి పేజీ తరువాయి

చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఎన్నికలు సాఫీగా జరిగే అవకాశం లేదని విమర్శించారు. అధికారాన్ని ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు, అరెస్టులు, జైలు పంపడం వంటి చర్యలకు పాల్పడుతున్నారని ఫైర్ అయ్యారు. రోజుకో డ్రామా, రోజుకో నటన, డైవర్షన్ పాలిటిక్స్‌తో ప్రజల దృష్టిని మళ్లించే ప్రయత్నం జరుగుతోందన్నారు. అయితే ఎన్నికలు ఎప్పుడు, ఎలా జరిగినా ప్రజలకు వైసీపీ అండగా నిలుస్తుందని జగన్ స్పష్టం చేశారు.

ఎన్నికలు సజావుగా జరిగితే వైసీపీదే విజయమని వైఎస్ జగన్ ధీమా వ్యక్తం చేశారు. ఒకవేళ ఎన్నికలు సజావుగా జరగనివ్వకపోయినా పార్టీ శ్రేణులు వెనక్కి తగ్గకుండా గట్టిగా పోరాడాలని సూచించారు. స్థానిక ఎన్నికలు కార్యకర్తలకు సంబంధించిన ఎన్నికలని, ప్రజలకు కార్యకర్తలు అండగా నిలుస్తారని, వారికి పార్టీ కూడా అదే విధంగా తోడుగా ఉండాలన్నారు. స్థానిక ఎన్నికలను 'కురుక్షేత్ర సంగ్రామం'గా అభివర్ణించిన జగన్.. అధికార దుర్వినియోగం, పోలీసు బలగాల వినియోగం వంటి అంశాలపై ప్రజల్లో ఉన్న ఆగ్రహం భవిష్యత్ సాధారణ ఎన్నికల్లో ప్రతిఫలించాలని వ్యాఖ్యానించారు. దౌర్జన్యంతో ఎప్పటికీ పాలకులు రాజ్యం చేయలేరని అన్నారు. 2017లో తన పాదయాత్రకు ముందు జరిగిన నంద్యాల ఉప ఎన్నికను జగన్ ఈ సందర్భంగా ప్రస్తావించారు. తీవ్ర అధికార దుర్వినియోగం కారణంగా వైసీపీ 35 వేల ఓట్ల తేడాతో ఓడిపోయిందని చెప్పారు. 2014–19 మధ్య కాలంలో తమ పార్టీకి చెందిన 23 మంది ఎమ్మెల్యేలు, ముగ్గురు ఎంపీలను చంద్రబాబు తనవైపు తీసుకున్నారని ఆరోపించారు. ఆ తర్వాత తాను పాదయాత్ర చేపట్టగా ప్రజల నుంచి వచ్చిన స్పందన జనసునామీగా మారిందని అన్నారు.

2019 అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు స్పష్టమైన తీర్పు ఇచ్చారని వైఎస్ జగన్ గుర్తు చేశారు. 2019లో వైసీపీ 151 అసెంబ్లీ స్థానాలు, 22 లోక్‌సభ స్థానాలను గెలుచుకున్న విషయాన్ని ప్రస్తావించారు. పాలకులు ప్రజలకు మంచి చేసి, చేసిన అభివృద్ధిని చూపించి ఓట్లు అడగాలని, అప్పుడే ప్రజల ఆశీర్వాదం లభిస్తుందని వ్యాఖ్యానించారు. అబద్ధాలు, దౌర్జన్యాలను ప్రజలు ఎల్లప్పుడూ హర్షించరని జగన్ అన్నారు. రాబోయే కురుక్షేత్రంలో వైసీపీ కార్యకర్తలు ప్రజలకు అండగా నిలిచి గట్టిగా పోరాడాలని పిలుపునిచ్చారు. స్థానిక ఎన్నికలను పార్టీ శ్రేణులు ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలని జగన్ సూచించారు.

## ఉబర్, రాపిడోకు బిగ్ షాక్!




**న్యూస్ డెస్క్, 09 సెప్టెంబరు (ఇది కద నిజం):** ప్రముఖ రైడ్–హెయిలింగ్ సంస్థలైన ఉబర్, రాపిడో లకు దిమ్మతిరిగే షాక్ తగిలింది. చండీగఢ్ రాష్ట్రంలో 'అగ్రిగేటర్ పాలసీ–2025' నిబంధనలను పాటించడంలో విఫలమైన ఆ రెండు కంపెనీల అగ్రిగేటర్ లైసెన్సులను స్టేట్ ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ ఏకంగా 6 నెలల పాటు సస్పెండ్ చేసింది. నిబంధనల అమలుకు సంబంధించి గతంలో ఆయా సంస్థలకు యంత్రాంగం తరఫు నుంచి పలుమార్లు నోటీసులు జారీ చేసినట్లుగా అధికారిక ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

అయితే, కంపెనీల నుంచి సరైన పత్రాలు, ఆశించిన విధంగా రెస్పాన్స్ రాకపోవడంతో ఈ కఠిన చర్యలు తీసుకున్నట్లుగా స్పష్టం చేశారు. డ్రైవర్లకు ఆరోగ్య బీమా, టర్మ్ ఇన్సూరెన్స్, శిక్షణ, సరైన ఛార్జీల విధానం వంటి నిబంధనలను పాటించడంలో ఉబర్, రాపిడో సంస్థలు పూర్తిగా విఫలమైనట్లు అడ్మినిస్ట్రేషన్ పేర్కొన్నది. లైసెన్సులు రద్దు కావడంతో రాబోయే 6 నెలల పాటు చండీగఢ్ పరిధిలో ఆయా సంస్థల సేవలకు తీవ్ర అంతరాయం ఏర్పడే అవకాశం ఉంది.

## ఈ-20పై తెలంగాణ సర్కార్ క్లారిటీ!




**న్యూస్ డెస్క్, 09 సెప్టెంబరు (ఇది కద నిజం):** ఇథనాల్ కలిపిన పెట్రోల్ (ఈ20) వినియోగించడం వల్ల వాహనాలు దెబ్బతింటున్నాయని దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున చర్చ జరుగుతున్న వేళ తెలంగాణ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అసెంబ్లీలో కీలక ప్రకటన చేశారు. ఈ 20 పెట్రోల్‌తో వాహనాలు పాడవుతున్నట్లు ఫిర్యాదులు రాలేదని స్పష్టం చేశారు. బుధవారం శాసనమండలిలో ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు అడిగిన ప్రశ్నకు సమాధానం ఇచ్చిన మంత్రి.. ఈ 20 పెట్రోల్ వినియోగం వల్ల వాహనాలు పాడవుతున్నట్లు రవాణా శాఖ దృష్టికి ఎలాంటి సమాచారం లేదన్నారు. ఈ అంశం పూర్తిగా కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని ఆయిల్ సంస్థలు చూస్తున్నాయని అందువల్ల ఇప్పటి వరకు దీనిపై రాష్ట్ర రవాణా శాఖకు ఎలాంటి అధికారిక ఫిర్యాదులు అందలేదని తెలిపారు.

కాంగ్రెస్?కు మరో ఆలోచన లేదు:

తమకు ఫిర్యాదులు అందని కారణం వల్ల అధికారులు ఎలాంటి ప్రత్యేక మార్గదర్శకాలు లేదా ఆదేశాలు జారీ చేయలేదన్నారు. ఈ–20 ఇంధనం వల్ల వాహనాలకు నష్టం జరుగుతోందనే వార్తల్లో నిజం లేదని ఆయన పేర్కొన్నారు. విదేశీ మారకపు నిల్వలు, రైతులకు ఆదాయం, పర్యావరణ హితం కావడం వల్ల ఈ–20 విధానంలో కేంద్ర ప్రభుత్వంతో కాంగ్రెస్ ప్రభుత్వానికి మరో అభిప్రాయం లేదన్నారు. 1 ఏప్రిల్ 2026 నుంచి దేశవ్యాప్తంగా అన్ని పెట్రోల్ బంకుల్లో ఈ20 పెట్రోల్ అమల్లోకి వచ్చిందన్నారు. ఈ విధానం అమల్లోకి వచ్చిన నేపథ్యంలో సెంట్రల్ మోటార్ వెహికిల్ నిబంధనలను కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిందని ఈ ఏడాది 1 ఏప్రిల్ నుంచి తయారయ్యే కొత్త పెట్రోల్ వాహనాలు అన్నింటికి ఈ–20 ధృవీకరణ తప్పనిసరి చేశారన్నారు. మైలేజ్ కొంత తగ్గుతుందనే అభిప్రాయం ఉన్నా ప్రధానమైన లాభాలు ఉన్నాయన్నారు. ఈ20 విషయంలో అపోహలు ఉన్నాయే తప్ప నష్టం ఎక్కడా ప్రూవ్ కాలేదన్నారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయానికి అనుగుణంగా ఈ 20 విషయంలో అపోహలు తొలగించేందుకు స్టేట్ ట్రాన్స్పోర్ట్ డిపార్ట్మెంట్ ప్రత్యేక కార్యాచరణ తీసుకుంటామన్నారు. ఇథనాల్ ఫ్యాక్టరీ పెడతామంటే కాలుష్యం వస్తుందని అనేక అపోహలు సృష్టిస్తున్నారని కానీ ఇది అవాస్తవం అన్నారు. ఇథనాల్ ఫ్యాక్టరీల ఏర్పాటు వల్ల రైతులకు ఎలాంటి ఇబ్బంది లేదన్నారు. కొత్త మార్పులు వచ్చినప్పుడు కొన్ని ఇబ్బందులు తప్పవన్నారు. ఇథనాల్ పరిశ్రమలు వచ్చి రాష్ట్ర రైతాంగానికి మేలు జరగాలన్నారు.

## అమెరికాపై కెనడా వార్!




**న్యూస్ డెస్క్, 09 సెప్టెంబరు (ఇది కద నిజం):** అమెరికా, కెనడా మధ్య వాణిజ్య వివాదం మరోసారి ముదిరింది. ఇరు దేశాల మధ్య చర్చలు విఫలం కావడంతో టారిఫ్‌ల పోరు మరింత తీవ్రరూపం దాల్చింది. అమెరికా విధించిన సుంకాలకు ప్రతీకారంగా కెనడా తాజాగా వందలాది అమెరికా ఉత్పత్తులపై 15%, 25%, 50% వరకు టారిఫ్‌లను అమలు చేసింది. ఈ కొత్త సుంకాలు సెప్టెంబర్ 8 నుంచి అమల్లోకి వచ్చాయి. కెనడా విధించిన కౌంటర్ టారిఫ్‌ల పరిధిలో అమెరికాకు చెందిన సుమారు 700 ఉత్పత్తులు ఉన్నట్లు తాజాగా పలు నివేదికలు వెల్లడించాయి. అమెరికా నుంచి దిగుమతి అయ్యే స్టీల్, డెయిరీ ఉత్పత్తులు, వ్యవసాయ పరికరాలు, ఎలక్ట్రానిక్స్, గృహోపకరణాలు, పల్ప్, పేపర్ తదితర రంగాలకు చెందిన వస్తువులు ఈ జాబితాలో ఉన్నాయి. మొత్తం సుమారు 27.6 బిలియన్ కెనడియన్ డాలర్ల విలువైన అమెరికా దిగుమతులపై ఈ కొత్త టారిఫ్ ప్రభావం పడనుంది. ముఖ్యంగా స్టీల్, అల్యూమినియం వంటి కొన్ని ఉత్పత్తులపై గతంలో ఉన్న 25 శాతం కౌంటర్ టారిఫ్ ఇప్పుడు 50 శాతానికి పెరిగింది. కెనడా ప్రభుత్వం ఈ చర్యలను తమ కార్మికులు, రైతులు, తయారీ రంగాన్ని రక్షించేందుకు తీసుకున్నట్లు పేర్కొంది.

చర్చలు విఫలం.. ప్రతీకార చర్యలు

అమెరికా–కెనడా మధ్య వాణిజ్య చర్చలు గత నెలలో విఫలమైన నేపథ్యంలో తాజా పరిణామాలు చోటుచేసుకున్నాయి. అమెరికా కెనడా ఉత్పత్తులపై భారీ సుంకాలు విధించడంతో వాటికి సమానంగా స్పందించాలని కెనడా నిర్ణయించింది. సెప్టెంబర్ 8 నుంచి అమల్లోకి వచ్చిన కొత్త సుంకాలు అమెరికా విధించిన రేట్లకు అనుగుణంగా 15%, 25%, 50%గా ఉన్నాయి. ఇదిలా ఉండగా.. కెనడా ప్రతీకార చర్యలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కూడా మరింత కఠినంగా స్పందించారు. సెప్టెంబర్ 15 నుంచి కొన్ని కెనడా ఉత్పత్తులపై అదనపు చర్యలు తీసుకోనున్నట్లు అమెరికా తాజాగా ప్రకటించింది. అంతే కాకుండా కెనడా నుంచి దిగుమతి అయ్యే కొన్ని డెయిరీ ఉత్పత్తులు, ఆల్కహాల్, మోటార్ సైకిళ్లపై సెప్టెంబర్ 29 నుంచి దిగుమతి నిషేధాలు అమల్లోకి రానున్నాయని వెల్లడించింది. తాజా పరిణామాలతో అమెరికా – కెనడా మధ్య వాణిజ్య సంబంధాలు మరింత ఒత్తిడికి గురవుతున్నాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. రెండు దేశాల ఆర్థిక వ్యవస్థలు పరస్పర వాణిజ్యంపై గణనీయంగా ఆధారపడటంతో.. ఈ టారిఫ్ పోరు కొనసాగితే వ్యాపార సంస్థలు, తయారీ రంగం, వినియోగదారులపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందని నిపుణులు భావిస్తున్నారు.

## మాపై దాడి.. మాపైనే కేసులా?



**న్యూస్ డెస్క్, 09 సెప్టెంబరు (ఇది కద నిజం):** తెలంగాణలో ఎమర్జెన్సీ వాతావరణం నెలకొందని, కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో ప్రజాస్వామ్యం తీవ్ర ముప్పులో పడిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. తెలంగాణ శాసనసభ వేదికగా చెలరేగిన రాజకీయ ఉద్రిక్తతలు రాజ్‌భవన్ (లోక్ భవన్)కు చేరాయి. సభ ముగిసే వరకు సస్పెన్షన్‌కు గురైన బీఆర్ఎస్ శాసనసభ్యులు చట్టసభలు, పోలీసుల తీరుపై గవర్నర్‌కు అధికారికంగా ఫిర్యాదు చేశారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నాయకత్వంలో 10 మంది ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల బృందం బుధవారం (సెప్టెంబర్ 9) మధ్యాహ్నం లోక్ భవన్‌లో గవర్నర్ శివప్రతాప్ శుక్లాతో ప్రత్యేకంగా భేటీ అయ్యింది. ఈ సందర్భంగా అసెంబ్లీ ప్రాంగణంలో చోటుచేసుకున్న వరుస పరిణామాలను వివరిస్తూ 13 పేజీల సమగ్ర ఫిర్యాదు లేఖను గవర్నర్‌కు అందజేశారు.

అనంతరం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ లోక్ భవన్‌లో మాట్లాడారు. "రాష్ట్రంలో ఎమర్జెన్సీని తలపించేలా పాలన కొనసాగుతుంది. రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలపై గవర్నర్‌కు ఫిర్యాదు చేశాం. వెయ్యి రోజుల పాలన వైఫల్యాలపై గవర్నర్‌కు ఫిర్యాదు చేశాం. యూరియా కొరత, రైతు భీమాపై విషయాలను ప్రస్తావించాం. రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి మోసం చేశారు. పాలిటెక్నిక్ విద్యార్థుల సమస్యపై గవర్నర్‌కు కంప్లైంట్ ఇచ్చాం. రాహుల్ గాంధీ నల్ల టీ షర్ట్ వేసుకున్నట్టే.. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలము బ్లాక్ టీ షర్ట్ వేసుకున్నాం. బ్లాక్ టీ షర్ట్‌తో అసెంబ్లీకి వెళ్తుంటే మమ్మల్ని పోలీసులు అడ్డుకున్నారు. మాజీ హోంశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డిని మగ పోలీసులు గొంతు పట్టుకున్నారు. మాజీ మంత్రి సునీతా లక్ష్మారెడ్డి చీర పట్టుకొని లాగారు. మాపై దాడి చేసి మా పైనే ఉల్టా కేసులు పెడుతున్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన కేసీఆర్ చావు కోరుకున్నారు. వేముల వీరేశం, కుంభం అనిల్ రెడ్డి, నర్సారెడ్డి ఎర్రవల్లి ఫాం హౌస్ దగ్గరకు వచ్చారు. వేల మంది కాంగ్రెస్ గూండాలను ఎర్రవల్లి ఫాం హౌస్‌పై దాడి చేసేందుకు ఉసిగోల్పారు. మేము అనని మాటలను అన్నట్టు స్పీకర్‌కు ఆపాదించారు. దళిత స్పీకర్ అంటూ కాంగ్రెస్ ఎమ్మెల్యేలే స్పీకర్‌ను అవమానిస్తున్నారు. శాసనసభ కాదు దుష్యాసన సభలా మార్చారు. చావు డప్పు ఎప్పుడు కొడుతారో.. మనందరికీ తెలుసు. ఎర్రవల్లి ఫాం హౌస్ దగ్గర చావు డప్పు కొట్టారు. అసెంబ్లీ బయట జరిగిన ఘటనపై సీఎస్, డీజీపీని పిలిపించి మాట్లాడుతానని గవర్నర్ హామీ ఇచ్చారు. ఇలాంటి ఘటనలు మంచివి కాదని గవర్నర్ మాతో చెప్పారు." అని కేటీఆర్ వివరించారు.

## తెలుగు రాష్ట్రాలకు కేంద్రం వరాలజల్లు

మొదటి పేజీ తరువాయి

"ప్రధాని మోడీ నాయకత్వంలో రైల్వేల సమగ్ర ఆధునికీకరణ జరుగుతోంది. భవిష్యత్తులో భారీ రవాణా ఉండే మార్గాలతో పాటు ఏడు హై–డెన్సిటీ రైల్వే కారిడార్లలో నాలుగు లైన్లు, క్వాడ్రప్లింగ్ పనులు చేపడుతున్నాం" అని అశ్వినీ వైష్ణవ్ తెలిపారు.

మూడు ప్రాజెక్టులకు రూ.10,783 కోట్లు

కేబినెట్ ఆమోదించిన ప్రాజెక్టుల్లో భాగంగా రూ.10,783 కోట్లతో మూడు మల్టీ–ట్రాకింగ్ ప్రాజెక్టులకు ఆమోదం లభించింది. వీటిలో ఖరగ్‌పూర్–ఝార్సుగూడ (బాగ్‌దేహి) నాలుగో రైల్వే లైన్, కట్నీ–పెండ్రా రోడ్ నాలుగో లైన్,

బిలాస్‌పూర్ (ఉస్లాపూర్)–పెండ్రా రోడ్ మూడో లైన్ల ఈ మూడు ప్రాజెక్టులు పశ్చిమ బెంగాల్, జార్ఖండ్, ఒడిశా, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లోని 14 జిల్లాలను కవర్ చేయనున్నాయి. మొత్తం సుమారు 656 కిలోమీటర్ల మేర రైల్వే నెట్‌వర్క్‌ను విస్తరించనున్నాయి. దీంతో సుమారు 4,790 గ్రామాలకు మెరుగైన రైల్వే కనెక్టివిటీ అందనుంది. దాదాపు 56 లక్షల మంది ప్రజలు ప్రయోజనం పొందనున్నారు.

దక్షిణాది రాష్ట్రాల్లో ఐదు ప్రాజెక్టులు

తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల్లో మరో ఐదు రైల్వే ప్రాజెక్టులకు రూ.10,021 కోట్ల మేర కేబినెట్ ఆమోదం తెలిపింది.

ఆ ప్రాజెక్టులు..

అరకోణం–రేణిగుంట: మూడో, నాలుగో రైల్వే లైన్లు - 77 కి.మీ

వైట్‌ఫీల్డ్–బంగారుపేట: మూడో, నాలుగో లైన్లు - 47 కి.మీ

హోసూర్–ఓమలూరు: డబ్లింగ్ - 147 కి.మీ

సేలం–కరూర్–దిండిగల్: డబ్లింగ్ -159 కి.మీ

సికింద్రాబాద్ (ఘట్‌కేసర్)–కాజీపేట: మల్టీ–ట్రాకింగ్ - 110 కి.మీ

ఈ ఐదు ప్రాజెక్టుల ద్వారా సుమారు 540 కి.మీ మేర రైల్వే నెట్‌వర్క్ పెరగనుంది. మొత్తం 17 జిల్లాలు ఈ ప్రాజెక్టుల పరిధిలోకి వస్తాయి. సుమారు 2,121 గ్రామాలకు మెరుగైన రైల్వే కనెక్టివిటీ లభించనుండగా.. దాదాపు 52 లక్షల మంది ప్రజలు ప్రయోజనం పొందనున్నారు.

రైళ్ల రద్దీ తగ్గింపు.. సేవల్లో మెరుగుదల

ఈ ప్రాజెక్టుల ద్వారా రైల్వే లైన్ల సామర్థ్యం పెరగడంతో రైళ్ల రాకపోకలు మరింత సులభతరం కానున్నాయి. నిర్వహణ సామర్థ్యం పెరగడంతో పాటు సేవల విశ్వసనీయత మెరుగుపడనుంది. రైళ్ల నిర్వహణను సమర్థవంతంగా చేపట్టడంతో మార్గాల్లో రద్దీ కూడా తగ్గనుంది. ఈ ప్రాజెక్టులను పీఎం గతిశక్తి నేషనల్ మాస్టర్ ప్లాన్ కింద రూపొందించారు. మల్టీమోడల్ కనెక్టివిటీ, లాజిస్టిక్స్ సామర్థ్యాన్ని మెరుగుపరిచేలా సమగ్ర ప్రణాళిక, వివిధ భాగస్వాములతో సంప్రదింపుల ఆధారంగా వీటిని చేపడుతున్నారు.

పర్యాటక ప్రాంతాలకు మెరుగైన కనెక్టివిటీ

కొత్త రైల్వే ప్రాజెక్టుల వల్ల పలు ప్రముఖ పర్యాటక, ఆధ్యాత్మిక ప్రాంతాలకు కూడా రైలు కనెక్టివిటీ మెరుగుపడనుంది. తిరుపతి, తిరుత్తణిలోని సుబ్రమణ్య స్వామి ఆలయం, తిరుచానూరులోని శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయం, కోలార్ గోల్డ్ ఫీల్డ్స్, హోగెనక్కల్ జలపాతాలు, హోసూర్ కోట, మేట్టూర్ డ్యామ్, కొడైకెనాల్ కొండలు, సత్యమంగళం వన్యప్రాణి అభయారణ్యం, యాదాద్రిగుట్ట ఆలయం, భువనగిరి కోట తదితర ప్రాంతాలకు మెరుగైన రైల్వే సదుపాయం అందనుంది.

సరుకు రవాణాకు భారీ ప్రయోజనం

ఈ రైల్వే మార్గాలు బొగ్గు, సిమెంట్, ఇనుము, ఉక్కు, కంటైనర్లు, ఆటోమొబైల్స్, ఆహార ధాన్యాలు, పెట్రోలియం ఉత్పత్తులు, ఎరువులు వంటి కీలక సరుకుల రవాణాకు కూడా ఎంతో ముఖ్యమైనవి. దక్షిణాది రాష్ట్రాల్లో చేపట్టే ఐదు ప్రాజెక్టుల ద్వారా అదనంగా 47 MTPA(ఏటా 4.7 కోట్ల టన్నుల) సరుకు రవాణా సామర్థ్యం అందుబాటులోకి వస్తుందని కేంద్రం అంచనా వేస్తోంది. అలాగే లాజిస్టిక్స్ వ్యయాన్ని తగ్గించడంతో పాటు సుమారు 8 కోట్ల లీటర్ల చమురు దిగుమతులను తగ్గించేందుకు ఈ ప్రాజెక్టులు దోహదపడనున్నాయి. సుమారు 42 కోట్ల కిలోల $CO_2$ ఉద్గారాలు తగ్గుతాయని అంచనా. ఇది దాదాపు 2 కోట్ల చెట్లను నాటడంతో సమానం.

మరో మూడు ప్రాజెక్టులతోనూ భారీ ప్రయోజనం

ఇప్పటికే ఆమోదించిన మూడు ప్రాజెక్టుల ద్వారా అదనంగా 27 MTPA సరుకు రవాణా సామర్థ్యం పెరగనుంది. వీటి వల్ల సుమారు 12 కోట్ల లీటర్ల చమురు దిగుమతులు తగ్గే అవకాశం ఉంది. అదేవిధంగా సుమారు 62 కోట్ల కిలోల $CO_2$ ఉద్గారాలు తగ్గుతాయని అంచనా. ఇది దాదాపు 2.48 కోట్ల చెట్లను నాటడంతో సమానం. మొత్తంగా ఈ ప్రాజెక్టులు దేశ రైల్వే రవాణా సామర్థ్యాన్ని పెంచడంతో పాటు ప్రయాణికులు, సరుకు రవాణా, పర్యాటకం, లాజిస్టిక్స్ రంగాలకు గణనీయమైన ప్రయోజనం చేకూర్చనున్నాయి.

## కేసీఆర్‌కు సొంతవాళ్లతోనే ముప్పు

మొదటి పేజీ తరువాయి

పిండ ప్రదానం చేయడం సబబేనా?

"ప్రజలు కాంగ్రెస్‌కు అధికారాన్ని ఇస్తే, సిరిసిల్లలో సీఎం రేవంత్ రెడ్డికి బీఆర్ఎస్ నేతలు పిండ ప్రదానం చేయడం ఎంతవరకు సబబు? దీనిని ఓ ప్రధాన పత్రికలో కూడా ప్రచురించారు. స్పీకర్ పదవి విషయంలో బీఆర్ఎస్ నేత తాతా మధు మాట్లాడిన తీరును మీడియా మిత్రులు గమనించాలి. బీఆర్ఎస్ నాయకుల దిగజారుడు రాజకీయాన్ని యావత్ తెలంగాణ సమాజం ఖండిస్తోంది. కేసీఆర్ ప్రాణాలకు ప్రమాదం ఉందని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు డ్రామాలు ఆడుతున్నారు. నిజానికి కేసీఆర్ ఆరోగ్యం క్షీణించాలని, ఆయనకు చెడు జరగాలని సొంత ఇంట్లోనే కోరుకుంటున్నారు. హరీష్ రావు క్షుద్ర పూజలు చేస్తున్నారని కేసీఆర్ కూతురు కవిత స్వయంగా మాట్లాడిన వీడియోలు అందరి వద్ద ఉన్నాయి. సొంత కుటుంబ సభ్యులే కేసీఆర్ చెడు కోరుకుంటుంటే.. కాంగ్రెస్ పార్టీపై నిందలు వేయడం విడ్డూరంగా ఉంది. మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ మరణానికి కారణమైన వారిని కూడా క్షమించిన ఉదారత కాంగ్రెస్ పార్టీది. ఉద్యమ నాయకుడిగా కేసీఆర్‌పై అందరికీ గౌరవం ఉంది. ఆయన త్వరగా కోలుకుని అసెంబ్లీకి రావాలని మేము కోరుకుంటున్నాం. కాంగ్రెస్ ప్రభుత్వం దళితులకు, బలహీన వర్గాలకు న్యాయం చేసేందుకు నిరంతరం కట్టుబడి ఉంది" అని మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు.

## కవితపై పోస్టులు.. పోలీస్ యాక్షన్!

మొదటి పేజీ తరువాయి

హైదరాబాద్ పోలీస్ కమిషనర్ నుంచి ప్రాథమిక విచారణ నివేదిక అందిన వెంటనే అంతర్గత శాఖాపరమైన విచారణ (డిపార్ట్‌మెంటల్ ఎంక్వైరీ) చేపట్టి, నిబంధనల ప్రకారం కఠిన శిక్ష విధిస్తామని ఉన్నతాధికారులు వెల్లడించారు. శాఖాపరమైన క్రమశిక్షణ చర్యలతో పాటు కానిస్టేబుల్ అనిల్‌పై క్రిమినల్ కేసులు కూడా నమోదు చేశారు. హైదరాబాద్ సైబర్ క్రైమ్స్ పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నంబర్ 589/2026 కింద భారతీయ న్యాయ సంహిత సెక్షన్లు 75, 79లతో పాటు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ చట్టంలోని సెక్షన్ 67 కింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ప్రాథమిక విచారణలో నిందితుడు తన వ్యక్తిగత మొబైల్ ఫోన్ నుంచే ఈ అభ్యంతరకర పోస్టులను పెట్టినట్లు నిర్ధారణ కావడంతో, ఆ ఫోన్‌ను స్వాధీనం చేసుకుని ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీ పరీక్షల నిమిత్తం పంపించారు. మహిళలపై ఎలాంటి అసభ్య ప్రవర్తన జరిగినా కఠినంగా వ్యవహరిస్తామని, చట్ట నిబంధనల ప్రకారం తదుపరి న్యాయపరమైన చర్యలు కొనసాగుతాయని తెలంగాణ పోలీస్ శాఖ స్పష్టం చేసింది.

## సర్ పూర్తయ్యాకే ఎన్నికలా?




**న్యూస్ డెస్క్, 09 సెప్టెంబరు (ఇది కద నిజం):** రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై దాఖలైన పిటిషన్లపై హైకోర్టులో విచారణ జరిగింది. స్థానిక సంస్థల్లో బీసీలకు తగిన రిజర్వేషన్లు కేటాయించడంతో పాటు, సర్ ప్రక్రియను పూర్తి చేసిన తర్వాతే ఎన్నికల ప్రక్రియ ప్రారంభించాలని పిటిషనర్లు పిల్ దాఖలు చేశారు. ఈ పిల్‌లో దాఖలైన వినతులను పరిశీలించిన అనంతరం హైకోర్టు తదుపరి విచారణను వచ్చే బుధవారానికి వాయిదా వేసింది. అయితే ఈ కేసు విచారణ సందర్భంలో పిటిషనర్లు తమ వాదనలను వినిపించారు. బీసీ జనాభా లెక్కల ప్రకారం సరైన నిష్పత్తిలో రిజర్వేషన్లు ఖరారు చేయకుండా, ఓటర్ల జాబితాలోని లోపాలను సరిదిద్దే సమగ్ర సవరణ పూర్తి చేయకుండా ఎన్నికలకు వెళ్లడం సరికాదన్నారు. ఈ ప్రక్రియలు పూర్తి కాకుండా ఎన్నికలు నిర్వహిస్తే ఎంతోమంది అర్హులైన బీసీ అభ్యర్థులకు, ఓటర్లకు అన్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. తమ వంతు వాదనలు వినిపించేందుకు సమయం కావాలని ప్రభుత్వం, ఎన్నికల సంఘం కోరాయి. దీంతో హైకోర్టు కేసు తదుపరి విచారణను వాయిదా వేసింది.

# పేదల పెన్షన్‌కు అడ్డంకులు తొలగించాలి

**- కుక్కునూరు మండల సీపీఎం కార్యదర్శి యర్నం సాయికిరణ్**

ఇది కద నిజం, కుక్కునూరు: కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు 50 ఏళ్లు నిండిన బీసీ, ఎస్సీ, మైనారిటీలకు సామాజిక పెన్షన్ సౌకర్యం కల్పించాలని, సామాజిక పెన్షన్ల నమోదు గడువును సెప్టెంబర్ నెలాఖరు వరకు పొడిగించి, దరఖాస్తు నిబంధనలను సరళీకరించాలని కుక్కునూరు మండల సీపీఎం కార్యదర్శి యర్నం సాయికిరణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కుక్కునూరులోని సుందరయ్య భవనం ప్రజాసంఘాల కార్యాలయంలో మంగళవారం సీపీఎం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. షేక్ వలిపాషా అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో యర్నం సాయికిరణ్ మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండు సంవత్సరాల మూడు నెలల అనంతరం తొలిసారిగా సామాజిక పెన్షన్లను విడుదల చేయడంతో పెన్షన్ల కోసం ఎదురుచూస్తున్న పేదలకు కొంత ఊరట లభించిందన్నారు. అయితే పెన్షన్ దరఖాస్తు ప్రక్రియలో విధించిన నిబంధనలు, వివిధ ధ్రువపత్రాల సమర్పణతో లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ముఖ్యంగా డప్పు కళాకారులు, చర్మకారులకు సోషల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ సర్టిఫికెట్ తప్పనిసరి చేయడం వల్ల అనేక మంది దరఖాస్తు చేసుకోలేకపోతున్నారని అన్నారు. గతంలో మాదిరిగానే సెల్ఫ్ డిక్లరేషన్ ఆధారంగా దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించాలని కోరారు. సెప్టెంబర్ 7న ప్రారంభమైన పెన్షన్ నమోదు ప్రక్రియను సెప్టెంబర్ 16తో ముగించడం సరికాదని సాయికిరణ్ అన్నారు. వరుస సెలవులు, వివిధ ధ్రువపత్రాల సమర్పణ వంటి కారణాలతో లబ్ధిదారులకు తగినంత సమయం లేకుండా పోతుందని తెలిపారు. ఇంటి పన్ను రసీదు తదితర పత్రాలు సమర్పించాల్సి రావడంతో గ్రామీణ ప్రాంతాల్లోని పేదలు మరింత ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. అవసరమైన నిబంధనలను మాత్రమే కొనసాగిస్తూ దరఖాస్తు ప్రక్రియను సులభతరం చేయాలని, సెప్టెంబర్ నెలాఖరు వరకు నమోదు గడువును పొడిగించి అర్హులైన ప్రతి ఒక్కరికీ దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా 50 ఏళ్లు నిండిన బీసీ, ఎస్సీ, మైనారిటీలకు పెన్షన్ ఇస్తామన్న కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీని వెంటనే అమలు చేయాలని కోరారు. హామీని అమలు చేయకపోతే లబ్ధిదారులను సమీకరించి ఉద్యమం చేపడతామని యర్నం సాయికిరణ్ హెచ్చరించారు. ఈ సమావేశంలో సీపీఎం నాయకులు పులదాసు రమేష్, పోచవరపు వెంకటేశ్వర్లు, దుర్గమ్మ తదితరులు పాల్గొన్నారు.




# కాళోజీ స్ఫూర్తితో తెలంగాణ రక్షణ సేన అడుగులు

**● టీఆర్ఎస్ కార్యాలయంలో ఘనంగా కాళోజీ జయంతి వేడుకలు**

ఇది కద నిజం,హైదరాబాద్ :

ప్రజాకవి కాళోజీ నారాయణ రావు స్ఫూర్తితో తెలంగాణ రక్షణ సేన ముందుకు సాగుతుందని పార్టీ సీనియర్ నాయకులు ఎల్. రూప్ సింగ్, నవీన్ ఆచారి, సయ్యద్ ఇస్మాయిల్ అన్నారు. బంజారాహిల్స్ లోని పార్టీ కార్యాలయంలో బుధవారం కాళోజీ నారాయణరావు జయంతి సందర్భంగా పార్టీ నాయకులతో కలిసి వారి చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, తమ ప్రాంతంపై దోపిడీకి దిగితే ఎంతటి వాళ్లనైనా సరే ఎదురించాలంటూ తెలంగాణ సమాజాన్ని కాళోజీ చెతన్య పరిచారని అన్నారు. కాళోజీ స్ఫూర్తితోనే కవిత టీఆర్ఎస్ స్థాపించి ఈ ప్రాంత హక్కుల పరిరక్షణ కోసం పనిచేస్తున్నారని అన్నారు.




ప్రాంతేతరుడు దోపిడీ చేస్తే పొలిమేర వరకు తరిమికొట్టాలని, ప్రాంతం వాడే దోపిడీ చేస్తే ప్రాంతంలోనే బొంద పెట్టాలన్న పిలుపును ఆదర్శంగా తీసుకొని తెలంగాణ ప్రయోజనాల కోసం టీఆర్ఎస్ పనిచేస్తుందని అన్నారు. తెలంగాణను దోపిడీ చేసిన ఆంధ్రా పాలకులను తరిమికొట్టి ఈ ప్రాంతాన్ని విముక్తం చేసుకున్నామని.. ఇప్పుడు మన దగ్గరే ఉన్న మన వాళ్ల తెలంగాణాను దోపిడీ చేస్తున్నారని వాళ్లను బొంద పెట్టి సబ్బండ వర్గాలు, సకల జనుల అభివృద్ధి, సాధికారత కోసం తెలంగాణ రక్షణ సేన పాటు పడుతందని అన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎత్తరి మారన్న, ముస్తఫా, ఆనందం తదితరులు పాల్గొన్నారు.





# షాద్‌నగర్‌లో ఘనంగా 'కింగ్ పేపర్ శీనన్న' జన్మదిన వేడుకలు

ఇది కద నిజం:షాద్‌నగర్ పట్టణంలో 'కింగ్ పేపర్ శీనన్న' జన్మదిన వేడుకలు బుధవారం అభిమానులు, నాయకుల సమక్షంలో వైభవంగా జరిగాయి. కులమతాలకు అతీతంగా ప్రజాసేవే పరమావధిగా జీవిస్తూ, ఎంతోమంది యువకులకు ఉపాధి కల్పించి, రాజకీయాల్లో ఎంతోమందికి భవిష్యత్తును ప్రసాదించిన మహనీయుడు పేపర్ శీనన్న అని ఈ సందర్భంగా పలువురు కొనియాడారు. ఈ జన్మదిన వేడుకల్లో జనసేన పార్టీ సీనియర్ నాయకులు రాజు నాయక్, ఎండి ఆశ్రమం, శివ, జానీ, మహేష్, శ్రీకాంత్‌లతో పాటు భారీ సంఖ్యలో ఆయన అభిమానులు పాల్గొన్నారు. కేక్ కట్ చేసి శీనన్నకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆయన ఆయురారోగ్యాలతో సుదీర్ఘకాలం ప్రజాసేవలో కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ జిల్లేడు చౌదరిగూడ మండల అధ్యక్షుడు భూమగళ్ల రామకృష్ణ మాట్లాడుతూ.. "శ్రీనన్న చేసిన సేవా కార్యక్రమాలు వర్ణనాతీతం. గ్రామ స్థాయి నుండి క్షేత్ర స్థాయి వరకు ఆయన ఎన్నో సేవా కార్యక్రమాలు అందించి, ఎంతోమంది హృదయాల్లో చెరగని స్థానం సంపాదించుకున్నారు. ఆయన షాద్‌నగర్ ప్రజలకు ఒక బంగారు పర్వతం లాంటివారు అటువంటి వ్యక్తి లభించడం షాద్‌నగర్ ప్రజల పూర్వజన్మ సుకృతం" అని కొనియాడారు. ఈ వేడుకలు షాద్‌నగర్‌లో పండుగ వాతావరణాన్ని తలపించాయి.

# భాగ్యరథి డిగ్రీ కళాశాలలో ఘనంగా "భాగ్యరథి బిజినెస్ ఎక్స్‌పో--2026"

**● విద్యార్థుల్లో పారిశ్రామిక స్ఫూర్తి నింపిన ప్రముఖ పారిశ్రామికవేత్త వీ. విద్యాసాగర్**

ఇది కద నిజం,చింతల్, సెప్టెంబర్ 9: చింతల్‌లోని భాగ్యరథి డిగ్రీ కళాశాలలో విద్యార్థుల్లో సృజనాత్మకత, నూతన ఆలోచనలు, వ్యాపార దృక్పథం మరియు పారిశ్రామిక స్ఫూర్తిని పెంపొందించే లక్ష్యంతో "భాగ్యరథి బిజినెస్ ఎక్స్‌పో--2026"ను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 300 మందికి పైగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ పారిశ్రామికవేత్త వీ. విద్యాసాగర్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రేరణాత్మక ప్రసంగం చేశారు.

ముఖ్య అతిథి వీ. విద్యాసాగర్ ప్రస్థానం కామర్స్‌లో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించి, యూనివర్సిటీ స్కాలర్‌షిప్ పొందిన వీ. విద్యాసాగర్ , చార్టర్డ్ అకౌంటెన్సీ విద్యను అభ్యసిస్తూ 1982లో వ్యాపార రంగంలోకి అడుగుపెట్టారు. చిన్న స్థాయి నుంచి తన వ్యాపార ప్రయాణాన్ని ప్రారంభించి, అల్యూమినియం, ల్యాడర్స్, ఇంజినీరింగ్ ఉత్పత్తులు తదితర రంగాల్లో అనేక సంస్థలను అభివృద్ధి చేశారు. ప్రపంచ స్థాయి సంస్థలతో భాగస్వామ్యాలు ఏర్పరచుకుని, భారతదేశం నుంచి అంతర్జాతీయ మార్కెట్లకు ఉత్పత్తులను తీసుకెళ్లే స్థాయికి తన వ్యాపారాలను విస్తరించారు. అయితే ఆయన విజయ ప్రస్థానంలో ఎదురైన అడ్డంకులు, వాటిని అధిగమించిన తీరు విద్యార్థులకు ఎంతో స్ఫూర్తిదాయకంగా నిలిచాయి.

అల్యూమినియం ప్లాంట్ ఏర్పాటుకు మూడు సంవత్సరాలకు పైగా ప్రభుత్వ అనుమతుల కోసం ప్రయత్నిస్తూ, ఎదురైన అనేక అడ్డంకులను పట్టుదలతో అధిగమించి లక్ష్యాన్ని సాధించడం ఆయన సంకల్పబలానికి నిదర్శనమని కార్యక్రమంలో పేర్కొన్నారు.

"ఉద్యోగం కోరేవారిగా కాకుండా ఉద్యోగాలు కల్పించే స్థాయికి ఎదగాలి" విద్యార్థులను ఉద్దేశించి వీ. విద్యాసాగర్ మాట్లాడుతూ "జీవితంలో విజయం సాధించడానికి కేవలం మంచి మార్కులు లేదా మంచి ఉద్యోగం మాత్రమే సరిపోదు. కల, కష్టపడే తత్వం, పట్టుదల, కొత్తగా ఆలోచించే ధైర్యం అవసరం" అని అన్నారు.

నేటి +వల్గ విద్యార్థుల్లో సాంకేతిక పరిజ్ఞానం, సృజనాత్మకత, కొత్త ఆలోచనలు అపారంగా ఉన్నాయని, వాటిని వ్యాపార అవకాశాలుగా మలుచుకోవాలని సూచించారు. విద్యార్థులు కేవలం ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా, భవిష్యత్తులో ఉద్యోగాలు కల్పించే పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు.

"మీ పరిస్థితులు మీ భవిష్యత్తును నిర్ణయించవు. మీ ఆలోచనలు, మీ కష్టం, మీ పట్టుదల మీ భవిష్యత్తును నిర్ణయిస్తాయి. కలలు కనండి... నేర్చుకోండి.. కష్టపడండి.. పడిపోయినా మళ్లీ లేవండి" అంటూ విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపారు.



### ప్రతి స్టాల్‌కు రూ.2,000 ప్రోత్సాహకం

విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహించేందుకు ముఖ్య అతిథి ప్రతి స్టాల్‌కు రూ.2,000 చొప్పున ప్రోత్సాహక నగదు అందిస్తున్నట్లు ప్రకటించారు. ఈ ప్రకటనతో విద్యార్థుల్లో మరింత ఉత్సాహం నెలకొంది. ఎక్స్‌పోలో 12 వినూత్న విద్యార్థి స్టాల్స్ ఏర్పాటు చేసి Skill Mate, Food Adulteration, Eco Creators, Botanical Bliss, Budget Planning, Eco-Friendly Ganesh, Hair-O-Holic, Organic Fertilizers, Environmental Eco Products, Stock Market, Water Conservation & Filtering, Aura of Handlooms వంటి విభిన్న అంశాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా భాగ్యరథి డిగ్రీ కళాశాల డైరెక్టర్ నల్ల జై శంకర్ గౌడ్ మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి, వారిని భవిష్యత్‌లో ఉద్యోగార్థులుగా కాకుండా ఉద్యోగదాతలుగా తీర్చిదిద్దడమే కళాశాల ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థులకు పుస్తక జ్ఞానంతో పాటు ప్రాక్టికల్ నాలెడ్జ్, మార్కెటింగ్, కమ్యూనికేషన్, టీమ్ వర్క్, బిజినెస్ మేనేజ్‌మెంట్‌పై అవగాహన పెరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ నవీన్ రాజ్, బోధనా సిబ్బంది, బోధనేతర సిబ్బంది, అకాడమిక్ టీమ్ సభ్యులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. 300 మందికి పైగా విద్యార్థుల భాగస్వామ్యంతో జరిగిన ఈ బిజినెస్ ఎక్స్‌పో విద్యార్థుల్లో నూతన ఆలోచనలు, ఆవిష్కరణలు మరియు పారిశ్రామిక స్ఫూర్తిని పెంపొందించే విజయవంతమైన వేదికగా నిలిచింది.

# ఆశా కార్యకర్తలకు రూ.18 వేల వేతనం ఇవ్వాలి

**● పిట్లం తహసీల్దార్‌కు వినతిపత్రం**



ఇది కద నిజం, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా పిట్లం: ఆశా కార్యకర్తలకు నెలకు రూ.18 వేల వేతనం చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఆశా కార్యకర్తలు ఆందోళన చేపట్టారు. అనంతరం పిట్లం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ మహేందర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఆశా కార్యకర్తలపై పనిభారం తగ్గించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, పెండింగ్‌లో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించి తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు.

# వినాయక మండపం వద్ద సీసీ కెమెరాల ఏర్పాటు



ఇది కద నిజం,హైదరాబాద్: గుడిమల్కాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని టెలికాం నగర్‌లో గజానన యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. పోలీసుల సూచనల మేరకు మండపంతో పాటు పరిసర ప్రాంతాల్లో కెమెరాలను అమర్చారు. కుల్సుంపుర డివిజన్ ఏసీపీ తిరుపతి, గుడిమల్కాపూర్ సీఐ రామయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకుడు నాగారం వేణు గౌడ్ సీసీ కెమెరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ప్రతి మండప నిర్వాహకులు తమ వంతు సామాజిక బాధ్యతగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేందుకు ముందుకు రావాలని సూచించారు. సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలకు చెక్ పెట్టడంతో పాటు అసాంఘిక కార్యకలాపాలను అరికట్టేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. గజానన యూత్ అసోసియేషన్ నిర్వాహకులు చొరవను పోలీసులు అభినందించారు.

# వినాయక చవితి వేడుకలకు 'శ్రీ రామ కోలాటం' బృందం ప్రదర్శనలు

**● ముందస్తు బుకింగ్స్ ప్రారంభం**

ఇది కద నిజం : వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీ రామ కోలాటం బృందం ఆధ్వర్యంలో ప్రత్యేక సాంప్రదాయ కోలాటం ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. గణేష్ ఉత్సవాలను మరింత వైభవంగా, సంప్రదాయబద్ధంగా నిర్వహించేందుకు దేవాలయాలు, ఉత్సవ కమిటీలు, వినాయక చవితి మండపాల నిర్వాహకులు శ్రీ రామ కోలాటం బృందం ప్రదర్శనల కోసం ముందస్తుగా బుకింగ్స్ చేసుకోవచ్చని పేర్కొన్నారు. మన సాంప్రదాయ కళలను ప్రోత్సహిస్తూ, చవితి వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచేలా ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకునే సాంప్రదాయ కోలాటం ప్రదర్శనలను అందించనున్నట్లు గురువు వెంకటేష్ తెలిపారు. వినాయక చవితి కార్యక్రమాల్లో శ్రీ రామ కోలాటం బృంద ప్రదర్శనల బుకింగ్స్ మరియు ఇతర వివరాల కోసం 95734 10081 ఫోన్ నంబర్ ద్వారా గురువు వెంకటేష్ ని సంప్రదించవచ్చని ఉత్సవ నిర్వాహకులకు విజ్ఞప్తి చేశారు.




# రాపూరులో 'నిజం గెలిచింది' కార్యక్రమం

నెల్లూరు జిల్లా రాపూరు (ఇది కద నిజం):-మాజీ ముఖ్యమంత్రి, ప్రస్తుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గత ప్రభుత్వంలో జరిగిన అరెస్టును నిరసిస్తూ, ఆయన జైలులో గడిపిన 53 రోజులకు గుర్తుగా రాపూరు ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో బుధవారం 'నిజం గెలిచింది' కార్యక్రమాన్ని నిర్వహించారు.వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ఆదేశాల మేరకు క్లస్టర్-3 ఇన్‌చార్జ్ చెన్ను పెంచల్ రెడ్డి నేతృత్వంలో ఈ సందర్భంగా 53 రోజుల జైలులో నిర్బంధానికి ప్రతీకగా 53 దీపాలను వెలిగించి శాంతియుత నిరసన తెలిపారు.ఈ సందర్భంగా టీడీపీ నాయకులు మాట్లాడుతూ... చంద్రబాబు నాయుడు గారు జైలులో ఉన్న సమయంలో కేవలం తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల్లోని ప్రజలు ఆయనకు బాసటగా నిలిచారని అన్నారు. రాజకీయ కక్ష సాధింపులో భాగంగానే అసత్య ఆరోపణలతో కేసులు పెట్టి చంద్రబాబు నాయుడిని 53 రోజులు జైలులో నిర్బంధించారని ఆరోపించారు.అయితే ఎలాంటి ఆధారాలు చూపలేకపోవడంతో చివరకు చంద్రబాబు నాయుడు గారు కడిగిన ముత్యంలా జైలు నుంచి బయటకు వచ్చారని నాయకులు పేర్కొన్నారు. నిజం ఎప్పటికైనా గెలుస్తుందనే నమ్మకానికి ప్రతీకగానే 'నిజం గెలిచింది' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. చంద్రబాబు నాయుడు పోరాటానికి ప్రజల మద్దతు ఎప్పటికీ ఉంటుందని, న్యాయం, ధర్మం చివరికి విజయం సాధిస్తాయని టీడీపీ నాయకులు, కార్యకర్తలు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సొసైటీ అధ్యక్షుడు దందోలు వెంకటేశ్వర్లురెడ్డి, టిడిపి ప్రధాన కార్యదర్శి మురంరెడ్డి మధురెడ్డి, పచ్చిగళ్ల రత్నయ్య, కన్నయ్య, షేక్ అహ్మద్, తదితరులు పాల్గొన్నారు.



# అనిల్ రామారావు ఘనంగా సన్మానించిన జనసేన నాయకుడు నివాస్




నెల్లూరు జిల్లా రాపూరు(ఇది కద నిజం):-స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి తిరుపతి పార్లమెంట్ సమన్వయకర్తగా బాధ్యతలు చేపట్టిన అనిల్ రామారావును రాపూరు మండలం జనసేన పార్టీ నాయకుల తరఫున నివాస్ సర్వేపల్లి మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వెంకటగిరిలోని జనసేన పార్టీ కార్యాలయంలో అనిల్ రామారావుకు శాలువా కప్పి ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ బలోపేతానికి సమన్వయంతో పనిచేస్తూ, పార్టీకి మరింత విజయాన్ని అందించాలని ఆకాంక్షించారు.అనిల్ రామారావు రాజకీయ ప్రస్థానంలో ఇలాంటి మరెన్నో కీలక బాధ్యతలు చేపట్టి ప్రజలకు, పార్టీకి సేవలు అందించాలని రాపూరు మండలం జనసేన పార్టీ తరఫున నివాస్ సర్వేపల్లి కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని అనిల్ రామారావుకు శుభాకాంక్షలు తెలిపారు.




# 'ప్యారడైజ్'కు ప్యాకప్




న్యాచురల్ స్టార్ నాని హీరో తెరకెక్కుతున్న మోస్ట్ అవైటెడ్ మూవీ 'ది ప్యారడైజ్'. 'దసరా'తో బ్లాక్‌బస్టర్ హిట్ అందుకున్న డైరెక్టర్ శ్రీకాంత్ ఓదెల మరోసారి నానితో కలిసి పనిచేస్తుండటంతో ఈ ప్రాజెక్ట్‌పై ఫస్ట్ నుంచే భారీ అంచనాలు నెలకొన్నాయి. తాజాగా ఈ మూవీకి సంబంధించిన కీలక అప్‌డేట్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. 'ది ప్యారడైజ్'కు సంబంధించిన టోటల్ షూటింగ్ ఈ రోజుతో పూర్తయినట్లు సమాచారం. సుదీర్ఘంగా సాగిన ఈ సినిమా షూటింగ్‌కి మేకర్స్ నేటితో గుడ్‌బై చెప్పి ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలపై పూర్తి స్థాయిలో దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఈ సినిమాలోని ఫస్టాఫ్‌కు సంబంధించిన ఫైనల్ మిక్సింగ్ కూడా పూర్తయినట్లు సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

ఇక సెకండాఫ్ పోస్ట్ ప్రొడక్షన్ పనులు ప్రస్తుతం శరవేగంగా కొనసాగుతున్నాయి. ఎడిటింగ్, సౌండ్, విజువల్ ఎఫెక్ట్స్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ వంటి కీలక విభాగాల్లో టీమ్స్ ఏకకాలంలో పనిచేస్తున్నట్లు సమాచారం. సినిమాను అనుకున్న సమయానికి ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు చిత్రబృందం ఎలాంటి విరామం లేకుండా పనులు పూర్తి చేస్తున్నట్లు తెలుస్తోంది. మరోవైపు ఈ మూవీకి మ్యూజిక్ సెన్సేషనల్ అనిరుధ్ రవిచందర్ స్వరాలు అందిస్తుండటంతో ఆడియోతో పాటు బ్యాక్‌గ్రౌండ్ స్కోర్‌పై కూడా అభిమానుల్లో భారీ అంచనాలు ఉన్నాయి. నాని సరసన హీరోయిన్‌గా కయాదు లోహర్ నటిస్తుండగా, కీర్తి సురేష్ స్పెషల్ సాంగ్‌లో కనువిందు చేయనుంది. ఈ మూవీని సెప్టెంబర్ 24న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేయనున్నట్లు మేకర్స్ ఇప్పటికే ప్రకటించారు. దీనికి ఒక రోజు ముందుగా అంటే వరల్డ్‌వైడ్ ప్రీమియర్స్ నిర్వహించనున్నట్లు సమాచారం. దీంతో రిలీజ్‌కు సమయం దగ్గరపడుతున్న కొద్దీ ప్రమోషన్స్ కూడా మరింత జోరందుకునే అవకాశం ఉంది. షూటింగ్ పూర్తవడంతో నాని అభిమానుల్లో ఉత్సాహం మరింత పెరిగింది. ప్రస్తుతం జరుగుతున్న పోస్ట్ ప్రొడక్షన్ పనులు పూర్తయి, సినిమా ప్రేక్షకుల ముందుకు వచ్చే రోజు కోసం ఫ్యాన్స్ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.




# 'సీన్'గా సూర్య..?

కోలీవుడ్ స్టార్ హీరో సూర్య నటిస్తున్న తాజా సినిమాకు సంబంధించి సోషల్ మీడియాలో ఓ క్రేజీ అప్‌డేట్ వైరల్ అవుతోంది. 'ఆవేశం' వంటి బ్లాక్‌బస్టర్ చిత్రాన్ని తెరకెక్కించిన యంగ్ డైరెక్టర్ జీతూ మాధవన్ దర్శకత్వంలో సూర్య హీరోగా నటిస్తున్న ఈ సినిమాకు 'సీన్' అనే టైటిల్‌ను పరిశీలిస్తున్నట్లు ఫిల్మ్ సర్కిల్స్‌లో జోరుగా ప్రచారం జరుగుతోంది.

ఈ చిత్రంలో సూర్య సరసన నజ్రియా నజీమ్ హీరోయిన్‌గా నటిస్తుండగా, 'ప్రేమలు' ఫేమ్ మలయాళ యువ నటుడు నస్లెన్ కీలక పాత్రలో కనిపించనున్నారు. ఇది ఒక విభిన్నమైన యాక్షన్-కామెడీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతుండగా, ఇందులో సూర్య పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో కనిపించనున్నట్లు తెలుస్తోంది. మలయాళ ప్రముఖ సంగీత దర్శకుడు సుశిన్ శ్యామ్ ఈ సినిమాకు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన షూటింగ్ ఇప్పటికే పూర్తి కాగా, దీపావళి కానుకగా నవంబర్ 6, 2026న ఈ చిత్రాన్ని థియేటర్లలో విడుదల చేయడానికి మేకర్స్ సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. అయితే, ఈ సినిమాకు సంబంధించిన టైటిల్ మరియు విడుదల తేదీపై చిత్ర బృందం నుంచి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.

# విజయ్ యోధుడి విశ్వరూపం!




టాలీవుడ్ రౌడీ హీరో విజయ్ దేవరకొండ, నేషనల్ క్రష్ రష్మిక మందన్న జంటగా నటిస్తున్న పాన్ ఇండియా మూవీ 'రణబాలి'కి సంబంధించిన క్రేజీ అప్‌డేట్ వచ్చింది. సూపర్ హిట్ చిత్రం 'టాక్సీవాలా' తర్వాత విజయ్ దేవరకొండ, టాలెంటెడ్ డైరెక్టర్ రాహుల్ సాంకృత్యాన్ కాంబినేషన్‌లో వస్తున్న ఈ భారీ ప్రాజెక్ట్‌పై మొదటి నుంచి భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో చిత్ర నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ ఈ సినిమాకు సంబంధించిన మాస్ యాక్షన్ టీజర్‌ను అధికారికంగా విడుదల చేసింది. ఈ టీజర్ ప్రస్తుతం సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లో నిలిచింది.

19వ శతాబ్దం (1854 - 1878 మధ్య) బ్రిటిష్ పాలనా కాలం నాటి చారిత్రక నేపథ్యం, రాయలసీమ ప్రాంత ఆధిపత్య పోరాటాలు మరియు వాస్తవ సంఘటనల ఆధారంగా ఈ చారిత్రాత్మక కాన్వాస్ పై ఈ సినిమాను అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్నారు. ఇందులో విజయ్ దేవరకొండ శింగనమల బొబ్బిలి రణబాలి పాత్రలో కనిపించనుండగా, రష్మిక ఆయన భార్య జయమ్మ పాత్రలో అత్యంత సంప్రదాయబద్ధంగా, భావోద్వేగాలతో కూడిన పాత్రలో అలరించనున్నారు. అంతేకాకుండా, ఈ చిత్రంలో హాలీవుడ్ ప్రముఖ నటుడు ఆర్నాల్డ్ వోస్లూ క్రూరమైన బ్రిటిష్ అధికారి పాత్రలో ప్రధాన విలన్‌గా నటిస్తుండటం సినిమాపై అంచనాలను మరింత పెంచేసింది.

ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ అత్యున్నత నిర్మాణ విలువలతో ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా, స్టార్ మ్యూజిక్ డైరెక్టర్స్ అజయ్ -- అతుల్ ఈ చిత్రానికి ప్రాణం పోసేలా అదిరిపోయే సంగీతం అందిస్తున్నారు. టీ-సిరీస్ సంస్థ ఈ భారీ పాన్ ఇండియా చిత్రాన్ని సమర్పిస్తోంది. అన్ని కార్యక్రమాలను వేగంగా పూర్తి చేసుకుంటున్న ఈ చిత్రాన్ని దసరా కానుకగా అక్టోబర్ 16, 2026న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు మేకర్స్ ఇప్పటికే ప్రకటించారు. విడుదలైన మాస్ యాక్షన్ టీజర్‌తో సినిమాపై అంచనాలు మరింత తారాస్థాయికి చేరాయని, విజయ్ కెరీర్‌లోనే ఇదొక బిగ్గెస్ట్ పాన్ ఇండియా బ్లాక్‌బస్టర్ హిట్ అవుతుందని అభిమానులు గట్టి నమ్మకంతో ఉన్నారు.

# 'దృశ్యం 3' సస్పెన్స్ పీక్స్!

బాలీవుడ్ స్టార్ హీరో అజయ్ దేవగణ్ మోస్ట్ అవేటెడ్ సస్పెన్స్ థ్రిల్లర్ ఫ్రాంచైజీ చిత్రం 'దృశ్యం 3: ది కన్‌క్లూజన్' ట్రైలర్ విడుదలైంది. విజయ్ సల్గాన్కర్ పాత్రలో మరోసారి అజయ్ దేవగణ్ ప్రేక్షకులను మైమరిపించడానికి సిద్ధమయ్యారు.

గత రెండు భాగాలు సంచలన విజయం సాధించడంతో, ఈ మూడో భాగంపై ప్రేక్షకుల్లో మరియు సినీ వర్గాల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రంలో అజయ్ దేవగణ్, టబు, శ్రియా శరన్, జైదీప్ అహ్లావత్, ప్రకాష్ రాజ్, రజత్ కపూర్, ఇషితా దత్తా, మృణాల్ జాదవ్, కమలేష్ సావంత్ తదితరులు ప్రధాన పాత్రల్లో నటిస్తుండగా, అభిషేక్ పాఠక్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సస్పెన్స్ క్రైమ్ డ్రామాను అక్టోబర్ 2న గాంధీ జయంతి కానుకగా ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నారు. ఇక విడుదల చేసిన ట్రైలర్ సినిమాపై క్యూరియాసిటీని మరింత పెంచేస్తుంది. ఈసారైనా విజయ్ సల్గాన్కర్ పోలీసులకు చిక్కుతాడా లేదా అనే ఉత్కంఠ అందరిలోనూ నెలకొంది.



హిందీని 'జాతీయ భాష'గా పేర్కొంటూ కన్నడ స్టార్ శివరాజ్‌కుమార్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో చర్చకు దారితీశాయి. ఆయన ప్రధాన పాత్రలో, ఆర్. చంద్రు దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'ఒరిజినల్ మాన్‌స్టర్'. ఈ మూవీ కన్నడతో పాటు హిందీలో కూడా రూపొందుతుండగా.. ఈ సినిమాతో శివరాజ్ కుమార్ హిందీ చిత్రసీమలోకి అడుగుపెట్టబోతున్నారు. ఈ క్రమంలోనే తాజాగా టైటిల్ లాంచ్ ఈవెంట్‌లో పాల్గొన్న ఆయన్ను.. హిందీ డైలాగులు చెప్పడం గురించి ఆయనను ప్రశ్నించగా.. హిందీ తనకు రెండో భాష అని, తాను హిందీ మాట్లాడగలనని, అది సులభమైన భాష అని శివరాజ్ కుమార్ పేర్కొన్నారు. అంతే కాకుండా ప్రేక్షకులను కలిపేందుకు ఉపయోగపడే 'జాతీయ భాష'గా హిందీని అభివర్ణించారు. ఈ కామెంట్స్ కాస్త నెట్టింట వైరల్ అవుతుండగా.. ఈ వ్యాఖ్యలపై కన్నడిగులు, కన్నడ సంస్కృతి పరిరక్షకులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. హిందీని 'జాతీయ భాష'గా పేర్కొనడాన్ని ప్రశ్నిస్తూ.. భారతదేశానికి ఎలాంటి అధికారిక 'జాతీయ భాష' లేదని, అన్ని ప్రాంతీయ భాషలకు సమాన ప్రాధాన్యం ఉందనే స్పృహ కూడా లేకుండా.. కన్నడ నాట దిగ్గజ కుటుంబానికి చెందిన హీరో అయ్యుండి ఇలాంటి వ్యాఖ్యలు చేయడం కరెక్ట్ కాదంటూ మండిపడుతున్నారు.

# వివాదంలో శివరాజ్‌కుమార్

